క్లుప్తంగా

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం



పోచవరం(వత్సవాయి): ప్రతి భూసమస్యకు పరిష్కారం చూపడమే లక్ష్యమని నందిగామ ఆర్డీవో కె. బాలకృష్ణ తెలిపారు. గ్రామంలో గురువారం జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూమి సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. ముఖ్యంగా విస్తీర్ణంలో తేడాలు, ఖాతా నెంబర్ల తప్పులు, హద్దుల మార్పులు వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వస్తున్నాయని తెలిపారు. అటువంటి ఇబ్బందులు ఉన్న రైతులు గ్రామసభలను సద్వినియోగం చేసుకుని అర్జీలు అందించినట్లయితే వాటిని పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా మిగతా భూ సమస్యలు ఉన్న రైతులు కూడా నేరుగా అర్జీలు అందించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్. నరసింహారావు, డీటీ కె. ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ



గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని కేవీకేలో రైతులకు వేరుశనగ (టీసీజీ రకం) విత్తనాలను గురువారం కేవీకే కోఆర్డినేటర్ అచ్యుతరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ విత్తనాలను జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లోని పలువురు రైతులకు పంపిణీ చేశామన్నారు. ముఖ్యంగా విత్తనశుద్ధి చేసుకోవడం వల్ల పురుగు నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. వేరుశనగ పంటకు మంచి డిమాండ్ ఉందన్నారు. అనంతరం ఆచార్య ఎన్జీ రంగా జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శివప్రసాద్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యమ్మ అమ్మవారికి రూ. 8 లక్షల ఆదాయం



నందిగామ టౌన్: సత్యమ్మ అమ్మవారికి హుండీ కానుకల ద్వారా రూ. ఎనిమిది లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ హరిగోపీనాథ్ తెలిపారు. మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న అమ్మవారి ఆలయంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 రోజులకు గానూ రూ. 8,00,078ల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్, ఆలయ మాజీ చైర్మన్ చుండు శ్రీనివాసరావు, సత్యసాయి సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ తనిఖీ



జగ్గయ్యపేట: పట్టణంలోని రైల్వే వ్యాగన్ స్టేషన్ వద్ద గురువారం సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ ఇంజినీర్ రాజు రంజన్ రైల్వే లైన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మండల సర్వేయర్ అనూష్ పర్యవేక్షణలో రైల్వే ట్రాక్ పక్కనున్న రైల్వే, ప్రయివేట్ స్థలాలను సర్వే చేశారు. కొద్ది రోజుల్లో ట్రాక్ డబుల్ లైన్ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పరిశీలన



పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలనులో రేషన్ పంపిణీని తిరువూరు ఆర్డీఓ కె. మాధవి గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలోని రెండు రేషన్ దుకాణాలను, ఎండీయూ వాహనాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్ ఇనపనూరి లక్ష్మి దుకాణంలో 500 కిలోల బియ్యం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఎండీయూ వాహనంలో 500 కిలోల బియ్యం తక్కువగా ఉన్నట్లు ఆర్డీఓ గుర్తించారు. ఈ విషయమై రేషన్ డీలర్ లక్ష్మి, ఎండీయూ వాహన డ్రైవర్ తిరుపతిరావులపై 6 (ఏ) కింద కేసు నమోదు చేశారని పీడీఎస్ డీటీ నాగరాజు తెలిపారు. గంపలగూడెం తహసీల్దార్ రాజకుమారి, వీఆర్వోలు పాల్గొన్నారు.

లాభాలు రాక.. గిట్టుబాటు కాక

- మామిడి తోటలు నరికేస్తున్న రైతులు
- పెరిగిన ఖర్చులు.. తగ్గిన దిగుబడులు

పెనుగంచిప్రోలు: మునేరు పరివాహక ప్రాంతాలైన వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో మామిడి తోటల విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతోంది. మామిడి సాగు చేస్తే లాభాలు రావనే భావనతో రైతులు మామిడి తోటలు నరికేస్తున్నారు. అలాగే పెట్టుబడి ఖర్చులు పెరిగి దిగుబడులు రాక.. లాభాలు లేక మామిడి సాగును వదిలేసుకుంటున్నారు.

ప్రతికూల వాతావరణ పరిస్థితులు

మునేరుకు ప్రతి ఏడాది వరదలు రావడంతో తోటలు నీటిలో మునిగిపోతున్నాయి. గత ఏడాది జూలైతోపాటు ఈ ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వరదలకు మామిడి తోటలు నామరూపాలు లేకుండా పోయాయి. గతంలో పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో సుమారు మూడు వేల ఎకరాల్లో మామిడి సాగు విస్తీర్ణం ఉండగా ఇప్పుడది రెండు వేల ఎకరాలకు పడిపోయింది. పెరిగిన పెట్టుబడులకు తగ్గట్లు గిట్టుబాటు ధర లేకపోవడం కూడా మామిడి సాగుపై రైతులు ఆసక్తి చూపకపోవడానికి ఒక కారణం. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో కాపే తక్కువగా ఉండటంతో పాటు పంట కోసే సమయంలో గాలిదుమ్ములకు కాయలు మొత్తం రాలిపోతున్నాయి. దీంతో రైతులు మామిడి చెట్లను నరికివేస్తున్నారు. ముఖ్యంగా వత్సవాయి, పెనుగంచిప్రోలు మునేరు ఆయకట్టున ఉన్న రైతులు మామిడి చెట్లను నరికి మాగాణి పంటలు వేస్తున్నారు. అలాగే కొందరు రైతులు ఆకు కూరల సాగుకు లీజుకు ఇస్తున్నారు.



నరికేసిన మామిడి తోటలో ఆకుకూరల సాగు



పెనుగంచిప్రోలు మునేరు అవతల నరికిన మామిడి తోట

దళారుల దోపిడి

గత కొన్నేళ్లుగా మామిడి తోటల్లో తెగుళ్ల ఉధృతి పెరగడంతో సస్యరక్షణ చర్యలు చేపట్టినా దిగుబడులు బాగా తగ్గుతున్నాయి. దీనికి తోడు మామిడి ఎగుమతులు తగ్గడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. వ్యయప్రయాసలకు ఓర్చి మార్కెట్‌కు తరలించినా అక్కడ సరైన ధర లభించకపోగా రైతులు దళారుల చేతిలో దోపిడీకి గురవుతున్నారు. దీంతో మామిడి సాగుపై అయిష్టం ప్రదర్శిస్తున్నారు. మామిడి ధర నిర్ణయంలో కూడా ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ప్రయివేట్ వ్యాపారుల హవా పెరిగిపోయింది. ఏటా ఇదే పరిస్థితి ఉండటంతో రైతులు మామిడి చెట్లను నరికేస్తూ భవిష్యత్ ప్రణాళికలు ఏర్పాటు చేసుకొంటున్నారు.

సరైన ధర లేదు



మామిడికి సరైన ధర లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు తోడవ్వటంతో రైతులు మామిడి తోటలను నరికేసి మాగాణి పంటల సాగు చేపడుతున్నారు. మాగాణి పంటలకు పెట్టుబడి తక్కువ కావడంతో పాటు ఇతర ఖర్చులు కూడా అంతగా ఉండవు.

–పావిపేని శ్రీనివాసరావు, రైతు, సుబ్బాయిగూడెం

ఏటా నష్టాలే



మామిడి తోటలతో ప్రతి ఏటా నష్టాలే వస్తున్నాయి. కాపు కోసే సమయానికి తుఫాన్లు, గాలిదుమ్ములు వచ్చి కాయలు రాలిపోతాయి. మార్కెట్‌లో సరైన ధర లభించదు. మామిడికి ధరల నియంత్రణ లేకపోవడం వల్ల కూడా రైతులు నష్టపోతున్నారు. దీంతో తోటలు నరికేస్తున్నారు.

–గింజుపల్లి శ్రీనివాసరావు, రైతు, నవాబుపేట

మున్సిపల్ వార్డు కమిటీలు ఏర్పాటు చేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

జగ్గయ్యపేట అర్బన్: రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–ఎస్ ప్రకారం ప్రతి పట్టణ స్థానిక సంస్థలో వార్డు కమిటీలను విధిగా ఏర్పాటు చేయాలని సామాజికవేత్త, కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కర్లపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మున్సిపల్ కమిషనర్ ఎం. రామ్మోహనరావును కలిసి వార్డు కమిటీలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్ మొదటి సమావేశం నుంచి మూడు నెలల లోపు ప్రతి మున్సిపల్ వార్డుకు ఒక వార్డు కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉండగా నేటికీ అమలుకు నోచుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, మెరుగైన పాలనను అందించడానికి ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. స్థానిక సంస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచడానికి ఈ కమిటీలు దోహదపడతాయని తెలిపారు. టాక్స్ ప్లేయర్స్ అసోసియేషన్ ప్రతినిధి రాయపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

గుంతలమయంగా కోదాడ రహదారి



కోదాడ రోడ్డులోని కాశం షోరూం వద్ద గొయ్యి

జగ్గయ్యపేట: పట్టణంలోని కోదాడ రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతోంది. దాదాపు మూడు కిలోమీటర్ల మేర ఉన్న రహదారిపై గుంతలు పడటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి వెంబడి పాఠశాలలు ఉండటంతో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతోపాటు పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల శాంతి నగర్ వద్ద కారు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి గురించి అధికారులు పట్టించుకోవడమే లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ సర్కిల్, కాశం షోరూం, ఆర్టీసీ డిపో సెంటర్, శాంతి నగర్ ప్రాంతాల్లో రెండు అడుగుల మేర గుంతలు పడటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

డ్రెయిన్‌ను పునర్నిర్మించండి



5వ వార్డులో ధ్వంసమైన డ్రెయిన్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఐదవ వార్డులో ధ్వంసమైన డ్రెయిన్‌ను పునర్నిర్మించాలని ఆ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధ్వంసమైన డ్రెయిన్ ఫొటోలను ప్రదర్శించారు. గత ఏడాది రూ. నాలుగు లక్షల వ్యయంతో పెద్ద డ్రెయిన్ నిర్మించారని తెలిపారు. కాగా గత నాలుగు నెలల క్రితం ప్రయివేటు స్థల యజమానులు తమ స్థలాన్ని జేసీబీతో బాగుచేస్తున్న సమయంలో పలు మార్లు డ్రెయిన్‌పై జేసీబీ ఎక్కింది. దీంతో డ్రెయిన్ 80 మీటర్ల పొడవునా ధ్వంసమయిందని ఆయన తెలిపారు. ధ్వంసమైన డ్రెయిన్‌ను పునర్నిర్మాణం చేపట్టాలని పలుమార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో ఫిర్యాదు చేశానని చెప్పారు. అలాగే పలు మార్లు మున్సిపల్ కార్యాలయంలో రాతపూర్వకంగా ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా అధికారులు స్పందించి డ్రెయిన్ నిర్మాణం చేయాలని, లేని ఎడల న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని మనోహర్ తెలిపారు.

చిన్నంపేటలో రైతుల ధర్నా



చిన్నంపేటలో ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

చాట్రాయి: ఈ క్రాప్ నమోదు కాని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య డిమాండ్ చేశారు. చిన్నంపేట రైతు సేవా కేంద్రం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది పేద రైతులు తమ పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోలేక పోవడంతో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించుకోలేకపోతున్నారని చెప్పారు. గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, అసైన్‌మెంట్ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు ఉచితంగా బోర్లు, విద్యుత్ సర్వీసులు ఇచ్చి నీటి వసతిని కల్పించాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, రైతు సంఘం నాయకులు ఈవీ శ్రీనివాస్, మర్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీవీ రామన్ స్ఫూర్తితో పరిశోధనల్లో రాణించాలి

గానుగపాడు(తిరువూరు): సుప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ పరిశోధనల్లో మేటి అని, ఆయన స్ఫూర్తితో విద్యార్థులు పరిశోధనల్లో అద్భుతాలు సృష్టించాలని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి అన్నారు. సీవీ రామన్ జయంతి కార్యక్రమం గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు రాంప్రదీప్, సుదర్శన్, సాయిరాం, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, సాంబశివరావు, రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భౌతికశాస్త్రంలో రామన్ చేసిన ప్రయోగాలు, వాటి ఫలితాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది

నందిగామ టౌన్: స్కీనింగ్ పరీక్షలు చేయించుకుని సకాలంలో క్యాన్సర్ మహమ్మారిని గుర్తించడం వల్ల వ్యాధి నియంత్రణకు అవకాశం ఉంటుందని పీహెచ్‌వో వర్షిణీ పేర్కొన్నారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మండలంలోని మాగల్లు గ్రామంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల వద్దకే వచ్చి పదేళ్ల వయసు నిండిన వారందరికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండటంతోపాటు ముందస్తు పరీక్షలు చేయించుకుని క్యాన్సర్ మహమ్మారి నుంచి రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బాలికల లైంగిక వేధింపులపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్యాన్సర్ మహమ్మారిపై చందాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

అన్ని వర్గాలకు అందుబాటులో క్యాన్సర్ చికిత్స

మైలవరం: అన్ని వర్గాల ప్రజలకు క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి వచ్చిందని విజయవాడకు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కె. శ్రీరమ్య అన్నారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సహేలీ ద గరల్స్ క్లబ్, ఐసీసీ ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో మహిళా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి, ఇంజినీరింగ్ విద్యార్థినులకు క్లోజ్ ద కేర్ గ్యాప్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ శ్రీరమ్య మాట్లాడుతూ సర్వేకల్ క్యాన్సర్ లక్షణాలు, వ్యాధి నివారణ టీకాల ప్రాముఖ్యత, రోగ నిర్ధారణ పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ ఆర్. శోభారాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, ఐసీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ వి. పార్వతి మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరమ్యను సత్కరించారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నాం

జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగమణి

సాక్షి ఎఫెక్ట్

కంచికచర్ల: రైతులకు అవసరమైన ముఖ్య కార్యకలాపాలను నిరంతరం రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సాకా నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీన రైతులకు కియోస్క్ సేవలు కనుమరుగు అనే కథనాన్ని సాక్షి ప్రచురించింది. స్పందించిన వ్యవసాయశాఖ జిల్లా అధికారి రైతులకు సమాచార వ్యాప్తి, తాజా వ్యవసాయ సమాచారాన్ని అందజేయడం జరుగుతుందని అన్నారు. కనీస మద్దతు ధర మార్కెట్ ఇంటెలిజెన్స్ ఎఫ్ఏక్యూ నిబంధనలపై మార్కెట్ ధరల సమాచారాన్ని అందజేస్తున్నామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో కియోస్కులు ఒక భాగం అని పేర్కొన్నారు.

పిల్లల ఎదుగుదలపై దృష్టి సారించాలి



శిశు సంక్షేమంపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాది


నందిగామ టౌన్: శిశువుల ఎదుగుదలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విద్యాసాగర్ పేర్కొన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శిశు సంక్షేమ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పిల్లల్లో పోషకాహార లోపాలను నివారించవచ్చని తెలిపారు. అంతేకాకుండా చట్టాల పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.ఎల్. నరసింహారావు, కన్నెకంటి జీవరత్నం, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: డీఎస్సీ, ఎస్‌జీటీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారికి బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని జిల్లా సంచాలకులు శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత శిక్షణకు ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ 60 రోజులు కొనసాగుతుందని చెప్పారు. అభ్యర్థులు తమ బయోడాటాతోపాటు విద్యార్హతలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, టెట్ మార్కుల వివరాలతో విజయవాడ అశోక్ నగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్: 95050 94349 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

విస్సన్నపేట: ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ అలుపెరుగని పోరాటాలు చేస్తోందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుక్కడపు శ్రీనివాసరావు అన్నారు. విస్సన్నపేట మండల శాఖ కౌన్సిల్ సమావేశం మండల శాఖ అధ్యక్షురాలు చైతన్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లుగా యూటీఎఫ్ పలు పోరాటాలు చేసి ఉపాధ్యాయులకు అనేక సదుపాయాలు సాధించడంలో ప్రధాన పాత్ర పోషించిందని తెలిపారు. అనంతరం మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నికైంది. యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడిగా బీవీ రామారావు, అధ్యక్షుడిగా సీహెచ్ చంటిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎ. మురళి, ఉపాధ్యక్షుడిగా ఇ. నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు

వీరులపాడు: మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ అష్రఫున్నీసా బేగం పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు, వెల్లంకి గ్రామాల్లోని మద్యం దుకాణాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం దుకాణాల్లో నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించారు. అందుకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతేకాకుండా బెల్టుషాపులకు మద్యం దుకాణాల నిర్వాహకులు మద్యం సరఫరా చేస్తే సహించేది లేదని పేర్కొన్నారు. బెల్టుషాపులకు అనుమతులు లేవని నిబంధనలకు విరుద్ధంగా వాటిని నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు



నవాబుపేట(పెనుగంచిప్రోలు): గ్రామంలో తిరుమల తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామివారి అనుబంధ సంస్థ శ్రీవాణి ట్రస్ట్ రూ. 10 లక్షల నిధులు, భక్తుల విరాళాలతో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన విగ్రహాలు గురువారం గ్రామానికి వచ్చాయి. గ్రామంలో ఊరేగింపు అనంతరం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, జయవిజయులు, గరుడాల్ విగ్రహాలను ధాన్యాదివాసానికి గ్రామంలోని సీతారాముల కల్యాణ మండపంలో చేర్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, వేదపండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

13న ఇసుక వేలం

కంచికచర్ల: కంచికచర్ల మండలంలో ఇటీవల కొంతమంది అక్రమార్కులు పలు వాహనాల ద్వారా అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్న ఇసుకను ఈనెల 13వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు తహసీల్దార్ కార్యాలయం వద్ద వేలం వేయనున్నట్లు తహసీల్దార్ వి. జాహ్నవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గండేపల్లి, మోగులూరు, నక్కలంపేట, చెవిటికల్లు గ్రామాల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామని అన్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుక సుమారు 105 టన్నుల వరకు ఉంటుందని చెప్పారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సదరు ఇసుకను వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ వేలంలో పాల్గొనవలసిందిగా తహసీల్దార్ కోరారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు

నందిగామ టౌన్: రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని దిశా జిల్లా కమిటీ సభ్యురాలు మన్నే కళావతి పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు కొట్టుకుపోయిన మండలంలోని దాములూరు, కూడలి రహదారిని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రహదారి మరమ్మతులకు రూ. 50 లక్షల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వీరంకి వీరాస్వామి, తోట నాగమల్లేశ్వరరావు, చెరుకూరు హైమారావు, సాంబశివరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.